## క్లుప్తంగా

### ఇసుక లోడుతో వెళుతున్న ఏడు టిప్పర్లు పట్టివేత

గోపవరం : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక లోడుతో వెళుతున్న 7 టిప్పర్లను మండలంలోని పి.పి.కుంట చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన టిప్పర్లకు సంబంధించి వారి వద్ద ఎలాంటి రసీదులు లేకపోవడంతో టిప్పర్లను బద్వేలు రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. టిప్పర్లు సోమశిల నుంచి మైదుకూరు, పోరుమామిళ్ల ప్రాంతాలకు వెళుతున్నాయి. కాగా ఇదే చెక్‌పోస్టు ద్వారా నిత్యం వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుకను తీసుకెళుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పొరుగు జిల్లాలకు సంబంధించిన టిప్పర్లు, ట్రాక్టర్లకు సోమశిల పోలీసులు రేటు నిర్ణయించి వారి నుంచి వసూలు చేసిన తర్వాతనే రవాణాకు అనుమతిస్తున్నట్లు సమాచారం.

### కూటమి ప్రభుత్వంలో మాటలు తప్ప చేతల్లేవు
– ఎమ్మెల్సీ రమేష్ యాదవ్



ప్రొద్దుటూరు కల్చరల్ : సంపద సృష్టిస్తాం అంటూ ఎన్నికల్లో గొప్పలు చెప్పడం తప్ప అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 5 నెలల్లో ఒక్క పైసా సృష్టించలేదని.. కూటమి ప్రభుత్వంలో మాటలు తప్ప చేతల్లేవని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రమేష్‌యాదవ్ విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్, అభివృద్ధి, ఇతర హామీలు, ఉచిత ఇసుక అంటూ ప్రజలను సీఎం మభ్యపెడుతున్నారన్నారు. ప్రజాసంక్షేమ పథకాలు ఏవీ అమలు చేయని ప్రభుత్వం అప్పులు చేయడంలో మాత్రం రాకెట్‌లా దూసుకుపోతోందన్నారు. ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.59.000 కోట్లు అప్పు చేసిందన్నారు. కానీ ప్రస్తుతం ఎల్లో మీడియా చంద్రబాబు చేస్తున్న అప్పులపై నోరు మెదపడం లేదన్నారు.

### 17న ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు : గీతాశ్రమం వీధిలోని వరలక్ష్మి హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత సంతాన సాఫల్యత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వైద్య నిపుణులు డాక్టర్ శిల్ప, డాక్టర్ కిశోర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివాహిత జంటలకు సంతానం కలగడం ఒక ప్రధాన సమస్యగా మారిందని, ఆరోగ్యకరమైన బిడ్డ పుట్టాలనే ఆనందం కోసం తల్లిదండ్రులు ఎదురుస్తున్నారనిపేర్కొన్నారు. ప్రొద్దుటూరు ప్రాంత ప్రజలకు అత్యాధునిక సాంకేతిక వైద్య సేవలు అందుబాటులోకి తెస్తూ బెంగళూరు నుంచి సాంకేతికంగా అభివృద్ధి చెందిన నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటి సెంటర్ డాక్టర్ మహేష్ కోరెగోల్ ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. దంపతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# శివ లింగం.. సహస్ర రూపం



ఆలయంలో అలంకరించిన 108 శివలింగాలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శివపార్వతులు

బి.కోడూరు : బద్వేలు నియోజకవర్గ చరిత్ర అత్యంత ప్రాచీనమైనది. ఇక్కడ నిర్మించిన పురాతన శివాలయాలు ఎంతో మహోన్నతమైనవి. మహిమలు కలవని పెద్దలు చెబుతారు. ఇవన్నీ ఒకటైతే. జిల్లాలో ఎక్కడా లేని విధంగా బద్వేలు నియోజకవర్గంలోని బి.కోడూరు మండలంలోని మేకవారిపల్లె గ్రామ సమీపంలోని శ్రీశ్రీశ్రీ అఖిలాండేశ్వరి బ్రహ్మానంద ఆశ్రమంలో వెలసిన 108 శివలింగాలు భక్తుల పాలిట కొంగు బంగారంలా భావిస్తారు.

ఈ ఆశ్రమాన్ని 1993లో రిటైర్డ్ ఉద్యోగి అయిన చంద్రశేఖర్ స్థాపించారు. ఆయనకు అర్చకుడు నారాయణస్వామి తోడవడంతో ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందింది. ఆశ్రమంలో తెల్లజిల్లేడు, తులసి, వేప, శివుడికి ప్రీతిపాత్రమైన మారేడు చెట్టుతో పాటు జివ్వి, రావిచెట్లు కలిసి మొలచిన ప్రదేశం. అంతేకాక ఆహ్లాదకర వాతావరణం, సుందర ప్రదేశం, 108 శివలింగాల ప్రత్యేకత సాధించుకున్న ప్రత్యేక అద్భుత ఆలయం ఈ ఆశ్రమం.

**ఆకట్టుకుంటున్న సహస్రనామ శివలింగం**

ఈ ఆలయంలో 108 శివలింగాలతో పాటు ప్రత్యేకంగా సహస్రనామ శివలింగం భక్తులను ఆకట్టుకుంటోంది. ఒకే శివలింగంపై వెయ్యి శివలింగాల ప్రతిమలను చెక్కారు. దీంతో సహస్రనామ శివలింగానికి విశిష్టత సంతరించుకోవడంతో పాటు భక్తులు ప్రత్యేకంగా వచ్చి దర్శించుకుంటారు. ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు జిల్లాల నుంచే కాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ ఆలయ ప్రాంగణం ఆరుబయట ఉండటంతో పాటు భక్తులు సేదతీరడానికి ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు చల్లని చెట్లు, పూజలు చేసుకునేందుకు అనుకూలంగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తుంటారు. ప్రస్తుతం కార్తీకమాసం కావడంతో భక్తుల రాక మరింత పెరిగింది. కార్తీక మాసం పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**30 అడుగుల భారీ శివలింగం**

ఈ ఆలయంలో 30 అడుగుల భారీ శివలింగాన్ని ప్రతిష్ఠించి దాని చుట్టూ 108 శివలింగాలను మూడు వరుసలుగా ఏర్పాటు చేశారు. ఇక్కడ శివలింగాలతో పాటు సుమారు 20 అడుగుల నంది విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ఆలయంలో సాయిబాబా, దత్తాత్రేయ, సత్యనారాయణస్వామి ఆలయాలతో పాటు నాగులపుట్ట, నవగ్రహాలు, శ్రీకృష్ణభగవానుని విగ్రహాలు, నిలువెత్తు ఆంజనేయస్వామి విగ్రహం ఉంది.

**ఈ ఆలయానికి చేరాలంటే..**

ఈ ఆలయానికి భక్తులు చేరుకోవాలంటే బద్వేలు, పోరుమామిళ్ల నుంచి వచ్చే భక్తులు మార్గమధ్యంలో మొద్దుచింతమాను మీదుగా మేకవారిపల్లె వద్ద ఉన్న 108 శివలింగాల ఆలయానికి చేరుకోవచ్చు.

## ప్రతి రైతు బీమా చేయించుకోవాలి



తుమ్మలపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారి

బి.కోడూరు : రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి పంటల బీమా ప్రీమియం చెల్లించి నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి కౌశిక తెలిపారు. బుధవారం మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరిపంటను పరిశీలించారు. పంటకు సంబంధించిన సస్యరక్షణ చర్యలతో పాటు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే రబీలో సాగు చేసే పంటలకు పంటల బీమా చేయించుకోవాలని తెలిపారు. రైతులు బ్యాంకులో రుణాలు తీసుకుంటే ఆ పంటకు సంబంధించి ప్రీమియంను బ్యాంకులోనే చెల్లించాలన్నారు. అలాగే పంట రుణాలు తీసుకోని వారు కామన్ సర్వీసు సెంటర్లను సంప్రదించి ప్రీమియం చెల్లించాలన్నారు. రైతుల పంటల ప్రీమియం గురించి ఆయా రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ బ్రహ్మానందరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గ్రంథాలయాధికారి సుధాకర్ తదితరులు

అట్లూరు : గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని అట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశ్వర్థారెడ్డి, గ్రంథాలయాధికారి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించి వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సంపదతో పాటు మానసికాభివృద్ధి సొంతం చేసుకోవచ్చని వారు తెలిపారు.

**నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు**

మైదుకూరు : గురువారం నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పట్టణంలోని శాఖ గ్రంథాలయం నిర్వాహకుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను పాఠకులతో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారోత్సవాల కార్యక్రమాలను వివరించారు.

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని శాఖా గ్రంథాలయంలో నేటి నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జే.శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల దినోత్సవం పుస్తకాల ప్రదర్శన, చిత్ర లేఖనం, వ్యాస రచన, పద్య పఠనం పోటీలు నిర్వహించిన గెలుపొందిన విద్యార్థులు ముగింపు రోజు బహుమతులు ఇస్తామని తెలిపారు.

**గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి**

ఖాజీపేట : నేటి నుంచి 20వ తేదీ వరకు జరిగే గ్రంథాలయ వారోత్సవాలల్లో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని ఖాజీపేట మండల విద్యాశాఖ అధికారి స్వర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు 7 రోజుల పాటు పుస్తకపఠనం, వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

**గ్రంథాలయ వారోత్సవాలు జయప్రదం చేయండి**

పోరుమామిళ్ల : గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని లైబ్రేరియన్ ఆఫ్రిది పిలుపిచ్చారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్‌తో కలసి బుధవారం పోరుమామిళ్ల పరిధిలోని రెడ్డి కొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో పోస్టర్లు, బ్రోచర్లు, కరపత్రాలు విడుదల చేశారు.

## ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఆందోళన



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలాన్ని ఇచ్చి ఇళ్లు నిర్మించాలని కోరుతూ ఈనెల 18న సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇళ్ల కోసం దరఖాస్తు చేసిన పేదలందరూ కార్యక్రమానికి తరలి రావాలని కోరారు. చంద్రబాబు ఎన్నికల సందర్భంగా జగనన్న ఇచ్చిన సెంటు స్థలాన్ని రద్దు చేసి రెండు సెంట్లు, మూడు సెంట్ల చొప్పున ఇస్తామని తెలిపారని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆయన మాటను విశ్వసించి గెలిపించారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, రెండు సెంట్ల స్థలంగా మార్చి ఇవ్వాలని, ఇంటికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తోందన్నారు. అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేసి నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, పార్టీ నాయకులు శివారెడ్డి, ప్రమీల పాల్గొన్నారు.

## గుడిసెలు తొలగింపు

గోపవరం : మండలంలోని మడకలవారిపల్లె రెవెన్యూ పొలం 812 సర్వే నంబరులో ప్రభుత్వ భూమిని ఆక్రమించి గుడిసెలు వేస్తున్నారన్న సమాచారం రెవెన్యూ అధికారులకు తెలియడంతో తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి బద్వేలు అర్బన్ సీఐ రాజగోపాల్, పోలీసు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆక్రమిత గుడిసెలను తొలగించారు. దాదాపు వందకు పైగా గుడిసెలు వేయడంతో వాటన్నింటిని తొలగించి ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇళ్ల స్థలాలు మంజూరు కాని పేదలు ఎవరైనా ఉన్నట్లైతే వారు వెంటనే తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని తెలిపారు.

### ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

కాశినాయన : ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీపీ నల్లేరుపోలమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ మైథిలి మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సమావేశానికి కొంత మంది మండల స్థాయి అధికారులు గైర్హాజరయ్యారని, వీరిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉప్పలూరు సర్పంచ్ రాజారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో వేస్తున్న సిమెంటు రోడ్లు నాసిరకంగా ఉన్నాయని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పీఆర్ ఏఈ పుల్లయ్య సమాధానమిస్తూ కొలతలు ప్రకారమే సిమెంటు రోడ్డు వేయిస్తున్నామని సమాధానమిచ్చారు. మండల ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్యఆచారి, డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సందీప్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ మహేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, ఎంఈఓ నిర్మల, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### క్యాంపస్ సెలక్షన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని రాచపూడినాగభూషణం డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కళాశాల కరస్పాండెంట్ రాచపూడి సాయికృష్ణ తెలిపారు. కళాశాలలో జి.టెక్ జైన్‌కీర్తి, జి.టెక్ జైన్‌ఎక్స్ ఎడ్యుకేషనల్ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించిన సెలక్షన్స్‌లో కళాశాలకు చెందిన బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ మూడవ సంవత్సరం విద్యార్థులు మనోజ్ఞ, హరిత, వెంకటసాయి, సరస్వతి, జ్యోతిలు ఎంపికైనట్లు తెలిపారు. కంపెనీ హెచ్‌ఆర్‌లు సుఫియాన్, షాహిద్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

### పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

పోరుమామిళ్ల: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శుక్రవారం శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమణారెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు ఈ శిక్షణా తరగతులకు హాజరుకావాలని సూచించారు. రాబోవు 2015–26 సంవత్సరానికి సంబంధించి పంచాయతీల అభివృద్ధికి చేపట్టవలసిన ప్రణాళిక తయారీపై వివరిస్తామని తెలిపారు.

### సర్వే పూర్తి చేయాలి

రాజుపాళెం : ఎన్‌సీడీసీడీ, ఆర్‌బీఎస్‌కే స్క్రీనింగ్ సర్వేను త్వరతిగతిన పూర్తి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాజుపాళెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం శాంతికళ మాట్లాడుతూ సచివాలయాలకు క్లస్టర్ల వారిగా ఆశా కార్యకర్తలు మ్యాపింగ్ చేయాలన్నారు. అలాగే ఎన్‌సీడీసీడీ, ఆర్‌బీఎస్‌కే స్క్రీనింగ్ సర్వే గురించి తెలియజేశారు. వాటిపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



## విషయ పరిజ్ఞానం అవసరం



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఆర్డీఓ సాయి శ్రీ

చాపాడు : విద్యార్థులు విషయ పరిజ్ఞానంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాన్ని సాధించొచ్చు అని జమ్మలమడుగు ఆర్డీఓ సాయి శ్రీ అన్నారు. మండలంలోని లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలని పాఠశాలల విద్యలోనే విద్యార్థులకు ఉన్నత స్థితికి వెళ్లేందుకు బీజం పడుతుందన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు చెప్పిన విధంగా చదువుకుంటే ప్రతి విద్యార్థి గొప్ప స్థాయికి చేరుకుంటారన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీల్లో గెలుపొందిన వారికి ఆర్డీఓ బహుమతులు అందజేశారు. తహసీల్దారు రమాకుమారి, ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, హెచ్‌ఎం సూర్యనారాయణరెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## హైకోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు



మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున

ప్రొద్దుటూరు : హైకోర్టు ఆదేశాల మేరకు కూరగాయల మార్కెట్ వద్ద పెద్దమ్మ ఆలయ చుట్టూ ఆక్రమణలను తొలగించామని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున తెలిపారు. ఆయన బుధవారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 14 ఏళ్ల క్రితం ఇక్కడ పెద్దమ్మ ఆలయాన్ని నిర్మించారని తెలిపారు. తర్వాత చుట్టూ గదులు నిర్మించి ప్రైవేటు వ్యక్తులు డబ్బు వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఆర్టీఐ ద్వారా కొంత మంది సమాచారం అడిగారని తెలిపారు. గత మున్సిపల్ కమిషనర్ ఆక్రమణదారుడు సుధాకర్ మాదిగకు నోటీసు ఇవ్వడం జరిగిందని, ఆయన హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. హైకోర్టుకు తాము అన్ని వివరాలను సమర్పించామని, వీటిని తొలగించాల్సిందిగా సెప్టెంబర్ 17న హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. ఆ మేరకు ప్రస్తుతం ఆ క్రమణలను తొలగించామని తెలిపారు. మున్సిపల్ స్థలాలను ఎవరు ఆక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామని, ఇందు కోసం సచివాలయ సిబ్బందికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించామన్నారు. పన్ను బకాయిలు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

**అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయింపు**

ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పాత బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్లుగా పెద్దమ్మ ఆలయాన్ని నిర్మించిన తర్వాత తాను సేవా కార్యక్రమాలు చేస్తున్నానని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ 200 మంది పోలీసులతో ఆలయ పరిధిలోని కట్టడాలను కూల్చివేయించారని తెలిపారు. కేవలం దళితుడిననే కారణంతోనే ఈ కట్టడాలను తొలగించారని, పట్టణంలో ఎన్నో అక్రమ కట్టడాలు ఉన్నా పట్టించుకోలేదని విమర్శించారు. అనంతరం త్రీటౌన్ ఏఎస్ఐ సుబ్బయ్య ఆధ్వర్యంలో పోలీసులు సుధాకర్ మాదిగను అరెస్టు చేశారు.

## పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇసుక పంచాయితీ



ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలంలోని చౌడూరు గ్రామం వద్ద పెన్నా నది నుంచి రాత్రింబవళ్లు వందల ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. గ్రామస్తులు అడ్డు చెప్పినా వినకుండా అధికార పార్టీకి చెందిన నేత ఈ దందా కొనసాగిస్తున్నాడు. పైగా ప్రత్యేకించి గ్రామ పంచాయతీ అభివృద్ధి పేరుతో వేర్వేరుగా ట్రాక్టర్‌కు రూ.250 గేట్ వసూలు చేస్తున్నాడు. ఇసుక ట్రాక్టర్ల వేగం కారణంగా గ్రామస్తులు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందే పరిస్థితి ఏర్పడింది. మరో వైపు దుమ్ము, ధూళి ప్రభావానికి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు చెప్పినా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడకపోవడంతోపాటు ప్రశ్నించిన వారిపైనే దాడులకు పాల్పడే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై బుధవారం రూరల్ పోలీసులు ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి డబ్బు వసూలు చేస్తున్న నల్లగొంగు ఉదయ్ కుమార్‌రెడ్డితోపాటు రైతు చిలంకూరు శ్రీనాథరెడ్డి కుటుంబ సభ్యులను పిలిపించారు. ఇసుక అక్రమ రవాణా కారణంగా తాము సాగు చేసిన నాలుగు ఎకరాల మామిడి చెట్లు దెబ్బతింటున్నాయని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం వరకు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టపడగా సాయంత్రం నుంచి మళ్లీ యథావిధిగా సాగుతోంది. ఈ సమస్యపై గురువారం గ్రామం అంతా కలసి ఐకమత్యంగా ట్రాక్టర్లను అడ్డుకుంటామని పోలీసులకు సమాచారం అందించారు.

### నేటి నుంచి ఎన్‌సీడీ సర్వే

బి.కోడూరు : మండలంలో గురువారం నుంచి ఎన్‌సీడీ సర్వే నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీడీ అంటే అంటు వ్యాధులు కానటువంటి క్యాన్సర్, బీపీ, షుగర్ తదితర వాటి వివరాల గురించి గ్రామాల్లో సర్వే నిర్వహించేందుకు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి పరీక్షలు చేసి వ్యాధులను గుర్తిస్తారని తెలిపారు. 18 ఏళ్ల పైబడిన మహిళలు, పురుషులు సుమారు 15,377 మంది ఉన్నారని, 30 ఏళ్ల పైబడి వివాహమైన మహిళలు 6,747 మంది ఉన్నారని, వీరందరికి సర్వేకల్ క్యాన్సర్ పరీక్షలు, బ్రెస్ట్ క్యాన్సర్, నోటి క్యాన్సర్‌కు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.